సాక్షి
కుమురం భీం
శనివారం : 1 : ఫిబ్రవరి : 2025



సంక్షేమ ప్రస్తావన..

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో శుక్ర వారం గిరిజన దర్బార్ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివాసీ సంఘాలకు భరోసా కల్పించారు. 8లో▸



జోరుగా యాసంగి సాగు

రెబ్బెన మండలంలో యాసంగి పంటల సాగు జోరందుకుంది. ఈసారి కూడా రైతులు అధికంగా వరి సాగు వైపే ఆసక్తి చూపుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /18.8

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోతగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చలి ప్రభావం కొనసాగుతుంది.

నిర్మలమ్మ కరుణించేనా!



- గని కార్మికులు, ఉద్యోగులకు పన్ను బాధ
- రైల్వే, జాతీయ రహదారులపై ఆశలు
- కేంద్ర ప్రభుత్వ పథకాలపైనా విన్నపాలు
- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రవేశ పెడుతున్న బడ్జెట్ ఈ ప్రాంత వాసులకు నిరాశే మిగుల్చుతోంది. ఈ ప్రాంత అవసరాలను గుర్తించకపోవడంతోపాటు నిధుల విడుదలలోనూ వివక్ష చూపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రాంత సమస్యలను కేంద్రం ప్రభుత్వం ఆలకించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆయా శాఖల అభివృద్ధి, పథకాల కేటాయింపు తదితర అంశాలపై ఆశలు నెలకొన్నాయి.

జాతీయ రహదారుల నిర్మాణంపై..

జాతీయ రహదారుల నిర్మాణంలో వేగం పెరగాల్సి ఉంది. ఇప్పటికే ఎన్‌హెచ్–363 శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఎన్‌హెచ్–63 భూ సేకరణ దశలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న ఎన్‌హెచ్–63 జగ్దల్‌పూర్ వరకు నిర్మిస్తున్న రోడ్డు మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇవేకాకుండా ఎన్‌హెచ్–163జీ జైపూర్ మండలం నర్వా నుంచి గోపాల్‌పూర్ మీదుగా మంథని, వరంగల్, ఖమ్మం, విజయవాడ వరకు నిర్మించే రోడ్డు పనులు మొదలయ్యాయి. గతంలో ప్రతిపాదించిన బెల్లంపల్లి మీదుగా రెబ్బెన, కాగజ్‌నగర్, కౌటాల మీదుగా గడ్చిరోలీ హైవేను ఈ ఆర్థిక సంవత్సరంలో అనుమతి ఇస్తే మరో నాలుగు వరుసల హైవే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కేంద్ర ప్రాయోజిత పథకాలతోనూ..

మారుమూల ప్రాంతాల్లో ఇంకా టెలికాం సర్వీసులు మెరుగుపర్చాల్సి ఉంది. ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో నేటికీ మొబైల్ నెట్‌వర్క్ లేక ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మరింత విస్తరించాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం, గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో రోడ్లు, విద్య, వైద్యం తాగునీరు, పట్టణాల ఉన్నతీకరణకు నిధులు ప్రకటించాల్సి ఉంది. ఇక వేతన జీవులకు ఆదాయ పన్ను శ్లాబ్‌ల సవరణలపైనా ఆశలు నెలకొన్నాయి.

గని కార్మికులకు 'పన్ను' భారం

గతంతో పోలిస్తే సింగరేణి కార్మికులకు వేతనాలు రెట్టింపయ్యాయి. ఆదాయ పన్ను పరిధిలో నాలుగైదు ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారంతా రావడంతో ఏటా రూ.లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నారు. వేతన సవరణలతో గతంలో కంటే వేతనం మరింత పెరుగుతూ వస్తోంది. దీంతో ఒక్కో కార్మికుడు ఏడాదికి రూ.లక్ష నుంచి రెండు మూడు లక్షల వరకు చెల్లిస్తున్న కార్మికులూ ఉన్నారు. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో కనీసం రెండు నెలలు జీతం ఆదాయ పన్నుకే పోతోంది. ఇక కార్మికులకు సంస్థ ఇంటి అద్దె చెల్లిస్తోంది. ఈ అద్దెకు కూడా ఆదాయ పన్ను చెల్లించాల్సి వస్తోంది. అలవెన్స్‌లపై కూడా ఆదాయం పన్నుభారం మోపుతున్నారని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. గతంలో అన్ని రాజకీయ పార్టీలు ఆదాయ పన్ను మినహాయింపు ఇస్తామని హామీలు ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో పన్ను మినహాయింపును ప్రస్తావిస్తారా? అని కార్మికలోకం ఎదురుచూస్తోంది.

రైల్వే ప్రయాణికుల ఇక్కట్లు

ఈ ప్రాంత పరిధిలో రైలు మార్గం కీలకంగా ఉంది. ఉత్తర, దక్షిణ భారతదేశానికి అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో అనేక సమస్యలు నెలకొన్నాయి. రద్దీకి తగినట్లుగా అదనపు రైళ్ల మంజూరు, సౌకర్యాల పెంపుపై ఆశలు ఉన్నాయి. మంచిర్యాల నుంచి సిర్పూర్ –టి వరకు ఉన్న రైల్వేస్టేషన్లలో వసతులను ఆధునీకరించాల్సి ఉంది. ప్రస్తుతం అమృత్ పథకం కింద మంచిర్యాల స్టేషన్‌లో ఆధునీకరణ పనులు సాగుతున్నాయి.


మంచిర్యాల రైల్వే స్టేషన్

బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ప్రాంత పరిధిలోనూ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ఇవేకాకుండా రామక్రిష్టాపూర్, మందమర్రి, రేచినీ రోడ్, ఆసిఫాబాద్ రోడ్, సిర్పూర్–టి వరకు ఉన్న స్టేషన్లలో కనీస సౌకర్యాలు లేవు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫాంల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే, ప్రయాణికులకు ఊరట కలుగనుంది. ఇక కరోనా సమయంలో తొలగించిన రాయితీలు పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ప్యాసింజర్ రైళ్ల సంఖ్య బల్లార్షా–కాజీపేట, వరంగల్ మధ్య పెంచాలని కోరుతున్నారు. కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

కనీసం స్లాబ్‌లను మార్చాలి



బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గత పదేళ్లుగా ఆదాయపన్ను స్లాబ్‌లు కూడా మార్చలేదు. ప్రస్తుతం చాలామంది కార్మికులు 30శాతం శ్లాబ్‌లో ఉన్నారు. దీంతో ఎంతోమంది గని కార్మికులు తమ జీతంలో మూడు నెలల ఆదాయం పన్నులకే వెళ్తోంది. ఈ బడ్జెట్‌లోనైనా స్లాబ్‌లను సవరిస్తే కార్మికులకు ఊరట కలుగుతుంది.

– వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాధికారి రాంచందర్ నాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రాజేశ్వర్‌తో కలిసి ఆటో ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలరోజుల పాటు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపొద్దని, కారులో వెళ్లేవారు సీటు బెల్టు విధిగా ధరించాలని, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవీఐ విక్రమ్, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు వాజిద్, రవి, హోంగార్డులు సంతోష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత ముఖ్యం

ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రైవింగ్ చేయాలని జిల్లా రవాణాధికారి రాంచందర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్టీసీ డిపో పరిధిలో ప్రమాదాల రేటు తక్కువగా ఉండటాన్ని ప్రశంసించారు. డీఎం విశ్వనాథ్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణతో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదరహిత డిపోగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం 30 ఏళ్లుగా ప్రమాద రహితంగా బస్సులు నడుపుతున్న డ్రైవర్లు అన్వర్‌ఖాన్, కుతుబుద్దీన్, జమీల్‌ఖాన్‌ను ఉత్తమ డ్రైవర్లుగా గుర్తిస్తూ ప్రశంసాపత్రాలు అందించారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్యారేజీ ఇన్‌చార్జి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

ఆసిఫాబాద్‌అర్బన్: గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాల కోసం జిల్లాలో అర్హులైన ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాల ద్వారా స్థిరమైన ఆదాయం పొందుతూ ట్రాన్స్‌జెండర్లు సాధారణ జీవితం గడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ ద్వారా పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న 42 మంది ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు అందించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమశాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవికుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ విరమణ అనివార్యం


సుధాకర్‌ను సత్కరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఎస్సై సుధాకర్ ఉద్యోగ విరమణ పొందగా, శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సుధాకర్‌ను జిల్లా పోలీసు సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ 1989లో సుధాకర్ సివిల్ కానిస్టేబుల్‌గా నియామకమై, 35 ఏళ్లపాటు విధులు నిర్వర్తించారని తెలిపారు. పోలీసుశాఖకు ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. రిటైర్మెంట్ అయినప్పటికీ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ అంజన్న, సిబ్బంది శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్, ఓదేలు, స్వామి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని భీంరావు స్మారక పార్కులో శుక్రవారం ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ గద్దర్ సామాజిక ఉద్యమకారుడని కొనియాడారు. సమాజంలో రుగ్మతలను నిర్మూలించడానికి.. ప్రజలను చైతన్యం చేసేందుకు పాటల ద్వారా కృషి చేశారన్నారు. గద్దర్ ఎల్లప్పుడూ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా ఉంటారన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు ఇర్ఫాన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మారాం, టీకానంద్, కార్తీక్, రాజేందర్, వినోద్, శ్రావణి, భీంరావు, చునార్కర్ శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరకు ఆహ్వానం


మంత్రికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 13 వరకు మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే జాతరకు రావాలని శుక్రవారం మంత్రి సీతక్కకు ఉట్నూర్‌లో ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆహ్వాన పత్రిక అందించారు. అలాగే ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, పీసీసీ కార్యదర్శి సత్తు మల్లేశ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణను ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆలయ చైర్మన్ జయరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, గంటుమేర, మురళీ, విమలేష్, తులసీరాం, దత్తు, రాంచందర్, విమల, పల్లాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగోలో తెలంగాణ సైనికురాలు

- యూఎన్ సైనిక దళంలో బర్నాలీ మ్రిదా విధులు
- అంతర్యుద్ధంతో కుటుంబంలో ఆందోళన


యూఎన్‌లో సైనికురాలిగా విధుల్లో ఉన్న బర్నాలీ మ్రిదా(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌కు చెందిన సైనికురాలు బర్నాలీ మ్రిదా ఐక్యరాజ్య సమితి(యూఎన్) సైనిక దళంలో సేవలందిస్తున్నారు. నాలుగు నెలల క్రితం భారత ఆర్మీ తరఫున ఆఫ్రికాలోని కాంగో దేశం గోమా పట్టణంలో సైనికదళంలో సేవలు అందించడానికి వెళ్లారు. భారత సిక్ రెజిమెంట్ దళంలో గ్రూపు కమాండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బర్నాలీ మ్రిదా భర్త హరి మ్రిదా అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని భారతదేశ సరిహద్దు కోన్సా ప్రాంతంలో సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, కొద్దిరోజులుగా రువాండా ఎం23 తిరుగుబాటుదారులు కాంగో దేశంలోని ఉత్తర కివు ప్రావిన్స్‌లోని గోమా పట్టణానికి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నివసిస్తున్న ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితుల్లో బర్నాలీ క్షేమంపై భర్త ఆందోళన చెందుతున్నారు. రవీంద్రనగర్‌లోని కుటుంబం సభ్యులకు ఇంకా వివరాలు తెలియజేయలేదని, గోమాలో ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితి ఉన్నట్లు బర్నాలీ తెలియజేసిందని పేర్కొన్నారు. ఒక రాకెట్ లాంఛర్ నేరుగా వీరు ఉంటున్న శిబిరం నీళ్ల ట్యాంక్‌పై పడి పేలినట్లు ఆయన తెలిపారు. వారం రోజుల క్రితం సుమారుగా గోమా పట్టణంలో తిరుగుతున్న యుఎన్ వాహనంపై దాడి జరపగా వాహనం కాలిపోయిందన్నారు. స్థానిక ఎయిర్‌పోర్ట్‌లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా, ప్రస్తుతం ఇంటర్‌నెట్ పూర్తిగా నిలిపివేశారని, అక్కడి నుంచి సమాచారం పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. బర్నాలీతోపాటు మొత్తం 80 మంది భారతీయ సైనికులు ఉన్నారు. బంగ్లాదేశ్, అమెరికా దేశాల దళాలు సైతం ఉన్నట్లు సమాచారం. వీరి సైనిక శిబిరం వద్ద ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో అక్కడి బంకర్లలో తలదాచుకున్నట్లుగా బర్నాలీ ఫోన్ ద్వారా భర్తకు సమాచారం ఇచ్చారు. భోజనానికి, సాధారణ అవసరాలకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె తెలిపారు. ఆందోళనగా ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని హరిమ్రిదా వ్యక్తం చేశారు. ఎం23 తిరుగుబాటుదారుల నాయకులతో అక్కడి యూఎన్ సైనికదళాల అధికారులు మాట్లాడినట్లుగా సమాచారం. స్థానిక మిలటరీ దళాలు, పోలీసులు, స్థానికులకు ఎలాంటి సహకారం అందించవద్దని తమ ఆజ్ఞలు మితిమీరితే పరిణామాలు తమ నియంత్రణలో ఉండవని హెచ్చరించినట్లుగా తెలుస్తోంది.

వెదురు వస్తువుల తయారీతో ఆర్థికాభివృద్ధి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


సాలెగూడలో వెదురు యూనిట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: వెదురు వస్తువుల తయారీతో మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని సాలెగూడ గ్రామంలో గల వెదురు ప్రాసెసింగ్ యూనిట్‌ను శుక్రవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వెదురుతో వినూత్న వస్తువులు తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆయన వెంట ఏపీడీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, సరుకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలన్నారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మెనూ ప్రకారం భోజనం అందించారు. భోజనం కోసం తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులు వినియోగించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు ఉన్నారు.

వెక్కిరిస్తున్న ఖాళీలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం బెజ్జూర్ మండల కేంద్రంలో ఉంది. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్ ఏడు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందింది. అప్పటి నుంచి ఈ కేంద్రాన్ని ఆయా నిర్వహిస్తున్నారు. 30 మంది చిన్నారులు ఉండగా, ప్రతిరోజూ కేవలం పది మంది లోపే చిన్నారులు వస్తున్నారు. కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలు కూడా ఉన్నారు. రెగ్యులర్ అంగన్‌వాడీ టీచర్‌ను నియమించకపోవడంతో కేంద్రం నిర్వహణ గాడితప్పిందని స్థానికులు వాపోతున్నారు.



తిర్యాణి మండలం అమీన్‌గూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే కార్యకర్త పదేళ్ల క్రితం పదోన్నతిపై ఇతర ప్రాంతానికి వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. అక్కడ పని చేసే ఆయా ఆరేళ్ల క్రితం మృతి చెందారు. టీచర్, ఆయా పోస్టు రెండు ఖాళీగానే ఉండటంతో ఆ కేంద్రాన్ని సమీపంలోని మరో అంగన్‌వాడీ టీచర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షగా మిగిలింది.


దహెగాం మండలం అమరగొండ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చింతలమానెపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగ విరమణ పొందారు. ఏడాదిగా పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయాతోనే కేంద్రం కొనసాగుతోంది. ఇలా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్రాల నిర్వహణ గాడితప్పి, పోషకాహారం సక్రమంగా అందడం లేదు.



- అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత
- సక్రమంగా సేవలు అందక ఇబ్బందులు
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని ప్రభుత్వం

దహెగాం(సిర్పూర్): గ్రామాల్లో చిన్నారులను ఆటపాటలతో పాఠశాలకు అలవాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి పూర్వప్రాథమిక విద్యాలయాలుగా మార్చేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. అయితే జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయాల పోస్టుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులు ఏళ్లుగా భర్తీ చేయకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్, ఆయాల పోస్టులు 524, రెండు సీడీపీవో పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. దీంతో కేంద్రాలపై పర్యవేక్షణ లేక నిర్వహణ గాడి తప్పుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా 834 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 139 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 40,812 మంది చిన్నారులు, 4,688 మంది గర్భిణులు, 3,502 మంది బాలింతలు, 16,564 మంది కిశోర బాలికలు ఉన్నారు. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకపోవడంతో కొన్నిచోట్ల కేంద్రాలు తెరుచుకోవడం లేదు. మొత్తం 118 అంగన్‌వాడీ టీచర్, 406 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతోపాటు నిత్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం అందించాలి. అయితే వంట చేసేవారు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం అందడం లేదు. కిశోర బాలికలకు సైతం ఎలాంటి పోషకాహారం అందించడంలేదు. వాంకిడి, ఆసిఫాబాద్‌లో సీడీపీవో పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని సైతం పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు.

సౌకర్యాలు కరువు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు లేక చిన్నారులు, గర్భిణులతోపాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోరెండు నెలల్లో వేసవి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాల్లో చిన్నారులు ఉక్కపోత భరించకతప్పదు. మరుగుదొడ్లు లేని కారణంగా సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. మరోవైపు చాలాచోట్ల పక్కా భవనాలు సైతం లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి సౌకర్యాలు కల్పించి, అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక

జిల్లాలో అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించాం. ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లాం. జిల్లాలో 118 అంగన్‌వాడీ టీచర్లు, 406 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం. శిథిలావస్థలో ఉన్న 11 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతుల కోసం ఒక్కోదానికి రూ.2 లక్షల చొప్పున మంజూరయ్యాయి. మొదటి విడతలో 250 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. 60 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పిస్తున్నాం. రెండో విడతలో మిగతా కేంద్రాల్లో కూడా సౌకర్యాలు కల్పిస్తాం.

– భాస్కర్, ఐసీడీఎస్ పీడీ

క్లుప్తంగా

పవర్ ఎలక్ట్రానిక్స్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ట్రిపుల్‌ఐటీ అధికారులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్స్' అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ ప్రారంభించారు. మూడురోజులపాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీధర్షన్ తెలిపారు. ట్రిపుల్‌ఐటీ ఏవో రణధీర్ సాగితో కలిసి ఆయన వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిరైస్ టెక్నాలజీస్ సీఈవో డాక్టర్ కవిత కిరణ్‌ప్రసాద్ మాట్లాడారు. ప్రపంచ సాంకేతిక రంగంలో ఎలక్ట్రికల్ ప్రొక్షన్ మోటార్ ద్వారా వెహికల్స్ నడపడం నూతన విప్లవానికి దారి తీసిందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు ఎలక్ట్రానిక్స్ బ్యాటరీ మోటార్లు ఇతర వ్యవస్థలకు విద్యుత్ శక్తి ప్రవాహాన్ని నిర్వహించడంతో అనేక లాభాలున్నాయన్నారు. స్విట్జర్లాండ్‌లోని బ్రగ్స్ లిఫ్టింగ్ అప్లికేషన్ ఇంజినీర్ డాక్టర్ శ్రీరామ్ రంగరాజన్ పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్‌పై అధునాతన సాంకేతికతపై ఎలాంటి మార్పులు తీసుకురావాలో వివరించారు. కోఆర్డినేటర్లు లక్ష్మణ్ ము త్యం, వినయ్‌కుమార్, హెచ్‌వోడీ భావుసింగ్ భూ క్య, అసోసియేట్ డీన్స్ డాక్టర్ మహేశ్, డాక్టర్ విఠల్, డాక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంభమేళాలో నిర్మల్ జిల్లా వాసుల అదృశ్యం



బెల్లపు సత్తెవ్వ



ఏనుగుల బుచ్చవ్వ

కడెం: కుంభమేళాలో నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. కడెం మండలం పెద్దబెల్లాల్ జీపీ పరిధిలోని ఉప్పరిగూడేనికి చెందిన బెల్లపు సత్తెవ్వ, కల్లెడ గ్రామానికి చెందిన ఏనుగుల బుచ్చవ్వ మిస్సయ్యారు. ఈనెల 27న జగిత్యాలకు చెందిన బంధువులతో కలిసి మొత్తం 11 మంది మహిళలు ప్రత్యేక వాహనంలో ఈనెల 29న ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. వాహనాన్ని ముందే పార్కింగ్ చేయడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జగిత్యాలకు చెందిన మరో ఇద్దరు మహిళలతో కలిసి వీరు ఆటోలో గంగానదికి వెళ్లారు. ఈ నలుగురు తిరిగిరాకపోవడంతో బంధువులు గాలించారు. అయినా ఆచూకీ లభించలేదని సమాచారం. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కల్లెడకు చెందిన బుచ్చవ్వ కుమారులు మల్లేశ్, మహేశ్ శుక్రవారం తల్లి జాడ కోసం ప్రయాగ్‌రాజ్ వెళ్లారు.

ప్రమాదంలో ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలోని వంతెన వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. నజ్రుల్‌నగర్ విలేజ్ నంబర్-1 గ్రామానికి చెందిన ఆదిత్య మండల్ (19)తో పాటు మరో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రగాయాల పాలైన ఆదిత్యమండల్‌ను కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.



నాగోబాను దర్శించుకుంటున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కోనప్ప



గదిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకుడు రాంకిషన్



నాగోబాకు మొక్కుతున్న నాయకులు

సంక్షేమ ప్రస్తావన.. సంస్కృతి పరిరక్షణ

- నాగోబా దర్బార్ వేదికగా అధికారులు, ప్రజాప్రతినిధుల ఉవాచ
- ఆదివాసీ తెగలకు భరోసా
- 'కోడ్'తో అంతా గజిబిజి
- వేదికపైకి ప్రజాప్రతినిధుల రాకతో అధికారుల హైరానా
- పక్క గదిలోకి వెళ్లిన వైనం
- విస్తుపోయిన ఆదివాసీ నేతలు



నాగోబాను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు



దర్బార్‌కు హాజరైన ఆదివాసీలు

సాక్షి, ఆదిలాబాద్/ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరలో భాగంగా ఆలయ ఆవరణలో శుక్రవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. దర్బార్ హాల్‌లోని వేదిక మీదుగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివాసీ సంఘాలకు భరోసా కల్పించారు. సంక్షేమ పథకాలను దరిచేరుస్తామని హామీ ఇచ్చారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటేనే జాతికి గుర్తింపు లభిస్తుందని సూచించారు. కాగా, దర్బార్‌లో చిత్ర విచిత్రమైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఓ వైపు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రజాప్రతినిధులు దర్బార్‌కు రారని, అధికార యంత్రాంగమే పూర్తి స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. అయితే ప్రజాప్రతినిధులు కూడా దర్బార్‌కు రావడంతో గజిబిజి.. గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. దర్బార్‌లో వేదికపై ఉన్న ఆదివాసీ సంఘాల నేతలు, హాల్‌లో కూర్చున్న ఆదివాసీ ప్రజలు వేదికపై జరుగుతున్న పరిణామాలను చూస్తూ ఏం జరుగుతుందోనని ఆశ్చర్యపోయారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు అధ్యక్షతన ఉదయం 11 గంటల తర్వాత గిరిజన దర్బార్ మొదలైంది. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదివాసీ తెగల సంఘాల నేతలు ఆసీనులయ్యారు. మొదట ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ప్రసంగంతో దర్బార్ ప్రారంభమైంది. ఆ తర్వాత ఆదివాసీ తెగల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు ఒక్కొక్కరు మాట్లాడుతూ వచ్చారు. చివరగా కలెక్టర్ ప్రసంగం ముగిసిన తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, ఆదిలాబాద్ డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడారు.

గజిబిజి.. గందరగోళం

సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్బార్ హాల్‌లోకి వచ్చారు. వేదిక కింద ఆదివాసీ ప్రజల మధ్య కుర్చీల్లో కూర్చున్నారు. వీరి రాకను గమనించి వేదిక పైనున్న అధికారులంతా పక్కనున్న గదిలోలోకి వెళ్లారు. అయితే బీజేపీ ప్రజాప్రతినిధులిద్దరూ కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. ఆ తర్వాత అధికారులు వేదిక పైకి వచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. మరికొద్ది సేపటి తర్వాత రాష్ట్ర మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ నేతలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, ఆత్రం సుగుణ, సత్తు మల్లేశ్ తదితరులు హాల్‌లోకి ఎంట్రీ కాగా అధికారులంతా మరోసారి పక్క గదిలోకి ఉరుకులు పరుగులుగా వెళ్లిపోయారు. కాంగ్రెస్ నేతలు నేరుగా వేదికపైకి వచ్చి మంత్రి సీతక్కతో కలిసి అక్కడున్న కుర్చీల్లో ఆసీనులయ్యారు. ఆదివాసీ తెగల సంఘాల నేతలు కూడా వేదిక పంచుకున్నారు. కాగా, సాంస్కృతిక కార్యక్రమాలు, మంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతల ఉపన్యాసాలు కొనసాగుతూ వచ్చాయి. మొత్తంగా రెండు గంటలకు పైగా ఈ తంతు కొనసాగింది. రూమ్‌లోకి వెళ్లిన సుమారు పది మందికిపైగా అధికారులు ఈ కార్యక్రమాలు సాగుతున్నంత సేపు అక్కడే ఉండిపోయారు. బయటకు వచ్చే పరిస్థితి లేకపోయింది. మొత్తంగా ఈ తతంగాన్నంతా ప్రత్యక్షంగా చూసిన ఆదివాసీ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. అసలు ఏం జరుగుతుందోనని గందరగోళానికి గురయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేతలు వెళ్లిపోగా అధికారులు మళ్లీ వచ్చారు. ఈ పరిణామాలను కొందరు నవ్వుతూ వీక్షించారు.

నాగోబా దర్శనాలిలా..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా పలువురు రాజకీయ నేతలు నేరుగా నాగోబాను దర్శించుకున్నారు. వారు దర్బార్ వైపు రాకుండానే వెనుదిరిగారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దర్శనం అనంతరం అటునుంచి అటే వెళ్లిపోయారు. కాగా, మంత్రి సీతక్క ఆలయంలో పూజలు చేశారు. అక్కడ సీతక్కను మెస్రం వంశీయులు ఘనంగా సన్మానించారు. పలువురు సెల్ఫీలు కూడా దిగారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి



ఆదివాసీల అభ్యున్నతికి సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్లు, ఇండ్లు, ఉద్యోగావకాశాలు, పోడు భూములకు పట్టాలు, బోర్లు, విద్యుత్ సౌకర్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం. సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి.
– సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

నిధులు కేటాయించాం



సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదివాసీల అభ్యున్నతి కోసం పాటుపడటమే కాకుండా ఈ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం నిరంతరంగా కృషి చేస్తున్నారు. కేస్లాపూర్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇప్పటికే ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించారు.
– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

సమస్యలు పరిష్కరిస్తున్నాం



సంక్షేమ పథకాలకు సంబంధించి ఆదివాసీ ప్రజలు కౌంటర్లలో దరఖాస్తులు అందజేయాలి. ఏవైన అభ్యంతరాలున్నా తెలియజేయాలి. గ్రీవెన్స్‌లో వీటన్నింటినీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

ఆదివాసీలతో సత్సంబంధాలు



కమ్యూనిటీ పోలీసింగ్ విధానంలో భాగంగా శాఖాపరంగా ఆదివాసీలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాం. వివిధ మెడికల్ క్యాంపులు నిర్వహించి వారి ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. గతంలో మావోయిస్టుల సమస్య అధికంగా ఉండగా ఆదివాసీలతో సంబంధాలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం జిల్లాలో ఆ సమస్య లేదు. ఆదివాసీలతో సంబంధాలు మెరుగుపరుచుకుంటున్నాం. పోలీస్‌శాఖ పరంగా ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తాం.
– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

విద్య, వైద్యం మెరుగుకు కృషి



ఆదివాసీల్లోని అన్ని తెగలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం. విద్య, వైద్యం సదుపాయాల మెరుగుకు కృషి చేస్తున్నాం. పట్టాల సక్సేషన్‌ను సంబంధించి ప్రస్తుతం ఆసిఫాబాద్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌గా కొనసాగుతోంది. త్వరలో అన్ని జిల్లాల్లో అమలవుతుంది. బ్యాంక్ రుణాల పరంగా ఇబ్బంది ఎదురవుతోందని ఆదివాసీ తెగల సంఘాల నాయకులు చెబుతున్నారు. బ్యాంకర్లతో రివ్యూ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొనడం ద్వారా బ్యాంకర్ల దృష్టికి నేరుగా సమస్యలు తీసుకెళ్తాం. జాతర మహత్యం దేశమంతా తెలిసేలా కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగానే పెద్ద ఎత్తున గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాం.
– రాజర్షిషా, ఆదిలాబాద్ కలెక్టర్

రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో సత్తా



ట్రోఫీ అందుకుంటున్న బాలుర జట్టు



ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

- మూడోస్థానంలో ఆదిలాబాద్ జట్లు

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి 68వ ఎస్జీఎఫ్ అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలబాలికల జట్లు సత్తా చాటాయి. ఈనెల 29వ తేదీ నుంచి శుక్రవారం వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన పోటీల్లో మూడో స్థానంలో నిలిచాయి. మూడోస్థానం కోసం జరిగిన పోరులో బాలుర విభాగంలో జిల్లా జట్టు కరీంనగర్ జట్టును ఓడించగా, బాలికల జట్టు మెదక్ జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచిందని కోచ్ స్నేహ కుమారి, మేనేజర్లు భవ్యత, నగేశ్, రాజశేఖర్ తెలిపారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జట్లకు జిల్లా విద్యాధికారి ప్రణీత, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తదితరులు అభినందనలు తెలిపారు.

కూతురికి బియ్యం తెస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో లక్ష్మారెడ్డి మృతదేహం

బోథ్: మండలంలోని ధన్నూర్ 'బి' గ్రామంలో ఉంటున్న తన కూతురుకు బియ్యం బస్తాలు తెస్తూ.. రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ఏనుగు లక్ష్మారెడ్డి (55) బోథ్ మండలం ధన్నూర్ 'బి' గ్రామంలో ఉండే తన కూతురు మార లావణ్యరెడ్డి ఇంటికి ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకుని ఆటోలో వస్తున్నాడు. మండలంలోని కుచులాపూర్ శ్రీవేంకటేశ్వర ఆలయ సమీపంలో బోథ్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆటో డ్రైవర్ గంజేవార్ వసంతకృష్ణ వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మారెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ వసంతకృష్ణ తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని 108లో బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తన కోసం బియ్యం తెస్తూ తండ్రి మృతి చెందగా కూతురు లావణ్యరెడ్డి కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడి అల్లుడు జైపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



కోడె ప్రభాకర్ (ఫైల్)

నర్సాపూర్ (జి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోడె ప్రభాకర్ (40) భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి ప్రభాకర్ మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క కోడె సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిమాన్వితం.. బాసర క్షేత్రం

- నేటి నుంచి 'వసంత' వేడుకలు
- ఏర్పాట్లలో ఆలయాధికారులు
- ఏటా వైభవోపేతంగా ఉత్సవాలు
- భారీగా తరలి రానున్న భక్తులు



బాసరలోని సరస్వతీ ఆలయం

సరస్వతీ అమ్మవారు

భైంసా: దక్షిణ భారతదేశంలో అత్యంత మహిమాన్విత క్షేత్రంగా పేరొందిన బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో వసంత పంచమి వేడుకలు శనివారం నుంచి మూడురోజులపాటు కొనసాగనున్నాయి. మనశ్శాంతి ప్రసాదించే ప్రాంతంగా పేరొందిన ఈ క్షేత్రంలో అమ్మవారి జన్మదినాన్ని ఏటా వైభవోపేతంగా జరుపుతుంటారు.

పురాణాల్లో ఇలా..

బాసర సరస్వతీ అమ్మవారిని వ్యాసమహర్షి ఇసుకతో ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పురాణాలు చెబుతున్న ప్రకారం.. భారత యుద్ధాన్ని చూసి చలించిన వ్యాసమహర్షి ప్రశాంత చిత్తంతో తపస్సు చేయడానికి ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ధ్యానముద్రలో ఉన్న ఆయనకు శక్తిరూపం నీడలా కనిపించి వెనువెంటనే మాయమైంది. దీంతో ఆ రూపం ఎవరిదా..? అని తన దివ్యదృష్టితో చూడగా శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారు కనిపించింది. పూర్తిరూపం కనిపించకపోవడానికి కారణం అడగగా భూలోకంలోని పాపకార్యాల కారణంగా ఇక్కడ పూర్తి రూపాన్ని చూపెట్టలేకపోతున్నానని అమ్మవారు చెప్పింది. ప్రతీరోజు గోదావరిలో ధ్యానం చేసి పిడికెడు ఇసుకను నచ్చిన స్థానంలో వేయాలని, ఇలా వేసిన ఇసుకతో తన పూర్తిరూపం తయారవుతుందని, అనంతరం జ్ఞాన సరస్వతీగా అందరికీ దర్శనమిస్తానని అమ్మవారు తెలిపింది. ఇలా ఇసుకతో వ్యాసమహర్షి ప్రతిష్ఠించిన సరస్వతీ అమ్మవారి జన్మదినాన్ని ఏటా జరుపుతారు.

వ్యాసపురి నుంచి బాసరగా..

వేద వ్యాసుడు సృష్టించిన ఈ ప్రదేశాన్ని వ్యాసపురిగా తదుపరికాలంలో వాసరగా ప్రస్తుతం బాసరగా పిలుస్తున్నారు. మాఘశుద్ధ పంచమి రోజున అమ్మవారి జన్మదినాన్ని వసంత పంచమిగా పిలుస్తారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలకు ఆలయాన్ని సుందరంగా పూలతో అలంకరించారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవారికి పూజలు ఇలా..

బాసర సరస్వతీ ఆలయంలో శనివారం వేకువజామున 4గంటలకు మంగళవాయిద్య సేవ, సుప్రభాత సేవలతో పూజలు ప్రారంభించనున్నారు. సరస్వతీ, లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఉదయం 8గంటల నుంచి వేదపఠనం జరగనుంది. 9 గంటలకు ఛండీసహిత మేధా దక్షిణమూర్తి యాగ సంకల్పం చేయనున్నారు. గణపతిపూజ, పుణ్యాహావాచనం, మండపారాధన చేసి పూజలు ప్రారంభించనున్నారు.

హిందూ ఆలయాలపై వివక్ష

- ఎమ్మెల్యే రామారావుపటేల్
- వేడుకల ఏర్పాట్లపై అసహనం
- సర్కారు పట్టింపేదని ఆగ్రహం
- నేడు శ్రమదానానికి పిలుపు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రామారావుపటేల్

భైంసా: బాసరలో వసంత పంచమి ఏర్పాట్ల గురించి మూడు రోజులుగా ప్రభుత్వానికి, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ ఆరోపించారు. శుక్రవారం బాసరలో ఆయన ఏర్పాట్లు పరిశీలించి అసహనం వ్యక్తంజేశారు. బాసరలో నిర్వహించే ప్రధాన వేడుకల్లో వసంత పంచమి అత్యంత ప్రత్యేకమైందని తెలిపారు. సరస్వతీ అమ్మవారి జన్మదినం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని పేర్కొన్నారు. భక్తులకు తగినట్లు ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వసంత పంచమి వేడుకలను వైభవోపేతంగా జరపాలని తాను స్వయంగా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు ఉన్నతాధికారులకు పలుసార్లు విన్నవించినట్లు తెలిపారు. వరుసగా మూడు రోజుల నుంచి స్థానిక అధికారులకు సూచించినా.. ఎవరూ పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. హిందూ దేవాలయాలపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు.

నేడు బాసరలో శ్రమదానం

బాసరలో వసంత పంచమి వేడుకల ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై తాను నిరసన వ్యక్తం జేస్తున్నట్లు ఎమ్మెల్యే రామారావుపటేల్ తెలిపారు. గోదావరి నది పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. పుణ్యస్నానాలాచరించే భక్తులకు నీటి శుభ్రత ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. అతిముఖ్యమైన ఈ ఉత్సవాలను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. శనివారం ఉదయం ముధోల్ నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులు, పార్టీ పదాధికారులు, హిందూ బంధువులంతా బాసరకు రావాలని పిలుపునిచ్చారు. గోదావరి స్నానఘట్టాలను తామే శుభ్రం చేస్తామని తెలిపారు. కార్యకర్తలంతా కలిసి శ్రమదానంచేసి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.